


### ఉత్తమ ఉపాధ్యాయిని పురస్కారగ్రహీత ఆర్. సుశీలారాణి

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ ఉపాధ్యాయిని (సంగీతం) పురస్కారం పొందిన శ్రీమతి ఆర్. సుశీలారాణి. జంటనగరాల ప్రజానీకానికి 'బాలభారతి' సంస్థ అధినేతగా చిరపరిచితురాలే. సుశీలారాణి. స్వస్థలం విజయవాడ. తండ్రి రాయప్రోలు లక్ష్మీనరసింహం పేరొందిన రంగస్థల నటులు. బళ్ళారి రాఘవ ప్రభృతులతో కలిసి నాటకాలు ప్రదర్శించి ప్రసిద్ధిగాంచిన వ్యక్తి. వారి ప్రోత్సాహ ప్రేరితంగా చిన్ననాటి నుంచి సంగీతంపై అభిరుచి కలిగి మంగళంపల్లి బాలమురళీకృష్ణ, అన్నవరపు రామస్వామి, టి.ఆర్. సుబ్రహ్మణ్యం తదితరుల వద్ద కర్నాటక సంగీతాన్ని అభ్యసించి సుశీలారాణి పట్టభద్రులయ్యారు. అనంతరం రాజమండ్రిలో ఉపాధ్యాయ శిక్షణాకోర్సును పూర్తిచేసి విజయవాడ మున్సిపల్ పాఠశాలలో సంగీత ఉపాధ్యాయినిగా చేరారు. తర్వాత హైదరాబాదుకు బదిలీ అయి ఇక్కడి పాత మలక్‌పేటలోని అమరజీవి పొట్టి శ్రీరాములు పాఠశాలలో సంగీత ఉపాధ్యాయినిగా పని చేశారు. 1968 నుంచి హైదరాబాదులోని విజయనగర్ కాలనీలో వీరి ఆధ్వర్యంలోని 'బాలభారతి' సంస్థ ద్వారా ఎందరో ఔత్సాహిక బాలికలు 'కర్ణాటక సంగీతం, నృత్యం, సితార, తబలా తదితరాలలో శిక్షణ పొందారు. తమ 'బాలభారతి' సంస్థ ద్వారా కళాసారధి జి. వెంకటరెడ్డి స్థాపించిన అవార్డు - ప్రతీ ఏటా పదవతరగతి పరీక్షలలో అత్యధిక మార్కులు పొందిన విద్యార్థికి ప్రదానం చేస్తున్నారు. ఇటు గృహసంబంధిత కార్యక్రమాలను చూసుకుంటూ, అటు తన ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తిస్తూ, సాయంత్రం వేళల్లో 'బాలభారతి'ని సమర్థవంతంగా కొనసాగిస్తూ పలువురి మన్ననలు పొందిన సుశీలారాణికి ఈ ఉత్తమ ఉపాధ్యాయిని పురస్కారం ఎంతో స్ఫూర్తి నిచ్చిందని అన్నారు.

— వసుంధర

---

## చిట్టికథల పోటీలో రూ. 150 బహుమతి పొందిన కథ!



# ఏరు దాటాక

**—పి. హిమబిందు**

తెలివిగా దోచుకోగలగడమే వ్యాపార లక్షణం!

తెలివైన వాళ్ళుకూడా దోచబడేది కొందరు వడ్డీ వ్యాపారస్థుల దగ్గరే. ఆ నిజం రంగనాధానికి చాలా బాగా తెలుసు. అందుకనే అతడు చేసేది వడ్డీ వ్యాపారం మాత్రమే!

అతనెక్కువగా డబ్బు వడ్డీకిచ్చేది రిక్షావాళ్ళకు, రోడ్డు పక్కన చిన్న చిన్న అంగళ్ళు పెట్టి అమ్ముకునే వాళ్ళకూ మాత్రమే.

వాళ్ళయితే తీసుకున్న అసలుకు వడ్డీ మాత్రం చెల్లిస్తుంటారు. 'అసలు' మాత్రం ఎప్పటికీ తీర్చలేరన్న నిజం రంగనాథానికి బాగా తెలుసు.

అతనికి మెరికల్లాంటి వస్తాదులిద్దరు నమ్మిన బంట్లులా వుంటారు. వాళ్ళు ప్రతినెలాక్రమం తప్పకుండా వడ్డీలు వసూలు చేసుకొస్తుంటారు. ఈ పూట వడ్డీ వసూలుకు రంగనాథమే బయలుదేరాడు. వస్తాదులిద్దరూవున్నా ఈ పూట రంగనాధం స్వయంగా వడ్డీ వసూలుకు బయలు దేరాడంటే...

రిక్షా రాజయ్య ఇవ్వవలసిన వడ్డీ రెండు రోజుల నుంచి ఇవ్వకపోవడమే!

• • •

రిక్షా స్టాండులో రిక్షా ప్రక్కన నిల్చుని బాడుగల కోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్నాడు రాజయ్య. కానీ ఎవరూ రావడంలేదు. బాగా పరికించి చూశాడు. దూరంగా భారీకాయం ఒకటి కన్పించింది.

బాగా పరీక్షగా చూసి ఉలిక్కిపడ్డాడు.

అతడలా ఉలిక్కిపడ్డానికి కారణం - ఆ భారీ కాయం రంగనాథానిది కావడమే! బాగా దగ్గరైన తర్వాత -

"దండాలయ్యా!" వినయంగా వంగి నమస్కరించాడు రాజయ్య.

"నక్కవినయాలు మాని ముందు వడ్డీ సంగతి చూడు..." రాజయ్య దగ్గర నక్క వినయాలు ప్రదర్శించే గుణంలేదని తెలిసికూడా కఠినంగా చెప్పాడు రంగనాధం.

"రెండు రోజుల్నుంచి బాడుగలే లేవయ్యా!" ఎంతో మెల్లగా చెప్పాడు రాజయ్య.

"నీకు బాడుగల్లేవని వడ్డీ పెరగడం ఆగదుగా...?" ఆబోతులా కేకేసాడు రంగనాధం. వడ్డీ అనేది కాలంకంటే కాంతి కంటేకూడా వేగంగా పెరుగుతుంది. ఆ నిజం తెలియని అమాయకుడు రాజయ్య. అందుకనే ఏం సమాధానం చెప్ప కుండా మౌనంగా వుండిపోయాడు. "సాయంకాలంలోపల ఈ రోజుతో కలిపి మూడు రోజుల వడ్డీ తెచ్చివ్వాలి. లేకపోతే నీ... రిక్షా నా ఇంటి ముందు వుంటుంది జాగ్రత్త!" అని ఆఖరి వార్నింగ్ ఇచ్చి వెళ్ళిపోయాడు రంగనాధం.

రంగనాధం అన్నంత పనీ చేసే వ్యక్తని రాజయ్యకు బాగా తెలుసు.


"సాయంకాలంలోపు వడ్డీ డబ్బు ఇవ్వాలి. ఎలా?" అని ఆలోచిస్తున్నాడే తప్ప - ఇలా వడ్డీలు మాత్రమే కడుతూ పోతూంటే 'అసలు' ఎప్పటికీ కట్టలేనన్న భయంకర నిజాన్ని అతడేమాత్రం ఆలోచించడంలేదు.

రాజయ్య బాడుగలకోసం ఎదురుచూస్తూనే వున్నాడు.

ఒక్కటంటే ఒక్క బాడుగకూడా దొరకలేదు.

ఎండ తీవ్రత మాత్రం తగ్గింది. సాయంకాలం కావస్తోంది.

రంగనాధం ఎంత కర్కోటకుడో తెలిసిన రాజయ్యకు అతడు పెట్టిన గడువు దగ్గరపడిందని తెలుసుకునే సరికి ఒళ్ళంతా దడ ప్రారంభమైంది.



వాతావరణం చల్లబడ్డాకూడా ఒంట్లోని వేడి మాత్రం భయంకరంగా పెరగసాగింది.

రెండ్రోజుల్నుంచి సరిగా బాడుగలు దొరక లేదు. ఇంకో రెండు గంటల్లో బాడుగలు దొరుకుతాయన్న నమ్మకం అతడికేమాత్రం కలగ లేదు.

"ఇంకో రెండు గంటల్లో వడ్డీ డబ్బు మాత్రం రంగనాధానికి కట్టేయాలి. ఎలా? ఎలా?" అని ఎంతో తీవ్రంగా ఆలోచించసాగాడు. బాగా ఆలోచించిన మీదట అతడి మెదడులో చిన్న కదలిక - వెంటనే రిక్షా పెద్దాసుపత్రివైపు నడిపించాడు.

గంట తర్వాత చెమటలు కక్కుకుంటూ అయాసపడుతూ రిక్షాలాక్కొని రంగనాధం ఇంటికెళ్ళి వడ్డీ డబ్బు ఇచ్చేశాడు రాజయ్య.

• • •

ఆరోజు వచ్చిన వడ్డీ డబ్బునంతా జాగ్రత్తగా లెక్కచూసుకుంటున్నాడు రంగనాధం.

ఆ సమయంలో ఆత్రుతగా అతడి దగ్గరకు వచ్చిన అతడి భార్య -

"ఏవండీ... చంటాడికి వున్నట్లుండి వాంతులయ్యాయి. తగ్గుముఖం పడతాయికదా అనుకునేంతలో మళ్ళీమళ్ళీ అయ్యాయి. ఇప్పుడు కళ్ళు తిరిగి పడిపోయాడండీ..." అని ఏడుస్తూ చెప్పింది.

హుటాహుటిన కొడుకుని పెద్దాసుపత్రికి తరలించాడు.

ఆసుపత్రిలో డబ్బును మంచినీళ్ళలా ఖర్చుపెట్టసాగాడు రంగనాధం. అయినా కొడుకు పరిస్థితి కొంచెమైనా మెరుగవలేదు.

"చూడండి మీ అబ్బాయికి ఈ గ్రూప్ రక్తం ఓ బాటిల్ వెంటనే కావాలి. మా దగ్గరో బాటిల్ వుంటే ఎక్కించాం. అది చాలా రేర్ గ్రూప్... ఎలాగైనా ఓ బాటిల్ రక్తం తీసుకురండి. లేకపోతే మీ అబ్బాయి బ్రతకడం కష్టం." అన్న డాక్టరు వంక భయంగా చూస్తూ-

"అలాగే డాక్టర్" అని ఆత్రుతగా వెళ్ళిపోయాడు రంగనాధం.

ఊర్లోని బ్లడ్ బ్యాంకులన్నీ తిరిగాడు. ఎక్కడా ఆ గ్రూపు రక్తం దొరకలేదు.

బ్లడ్ బ్యాంకుల్లోని బ్లడ్ డోనర్స్ లిస్టులు వెతికి చివరకు ఓ రిక్షావాడిది ఆ గ్రూపు రక్తమేనని తెలుసుకున్నాడు. ఆ రిక్షావాడు ఎవరోకాదు రాజయ్య!

అంతే వెంటనే అతడి దగ్గరకెళ్ళి-

"రాజయ్యా! నీకెంత డబ్బు కావాలన్నా ఇస్తాను. ఓ బాటిల్ రక్తం ఇచ్చి నా బిడ్డ ప్రాణాలు కాపాడు" అని చేతులు పట్టుకొని బ్రతిమాలాడు రంగ నాధం.

ఒప్పుకొని రక్తం ఇవ్వడానికి ఆసుపత్రికి వచ్చిన రాజయ్యను చూసి -

"ఎంత డబ్బుకి కక్కుర్తిపడితే మాత్రం మళ్ళీ ఎలా వచ్చావయ్యా? సాయంత్రమే కదా వచ్చి ఓ సీసా రక్తం యిచ్చావు. ఇప్పుడు మళ్ళీ నీ రక్తం తీసుకోవడం కుదరదు, తీస్తే నీ ప్రాణాలకే ప్రమాదం." అని రాజయ్యను మందలించాడు డాక్టర్.

'సాయంత్రం రాజయ్య వడ్డీ కట్టింది రక్తం అమ్మిన డబ్బుతోనా' రంగనాధానికి ఆశ్చర్యం కలిగింది. ఓ క్షణం ఆలోచించి తప్పదన్నట్లు రాజయ్యవైపు దీనంగా చూశాడు రంగనాధం. ఆ చూపులో 'ఎలాగైనా నా కొడుకును నువ్వే బ్రతికించాలి' అన్న అర్థింపు వుంది.

"నా ప్రాణాలు పోయినా పర్వాలేదు. రక్తం తీసుకోండి." డాక్టరుతో స్థిరంగా చెప్పాడు రాజయ్య. రక్తం తీసుకున్నాడు డాక్టర్.

చావు బ్రతుకులమధ్య కొట్టుమిట్టాడుతున్న రంగనాధం కొడుకు బ్రతికాడు.

రాజయ్యకూడా రెండు రోజులు మృత్యువుతో పోరాడి ఆసుపత్రి నుంచి బయటపడ్డాడు.

"నీకెంత డబ్బుకావాలో నువ్వే అడుగు?" రాజయ్యను అడిగాడు రంగనాధం.

"మొట్టమొదటిసారిగా డబ్బుకోసం రక్తం అమ్మానయ్యా! మీ అబ్బాయికి రక్తం ఇచ్చింది మాత్రం డబ్బుకోసం కాదు..." అని డబ్బేం తీసుకోకుండా వెళ్తున్న రాజయ్యవైపు అదోలా చూస్తూండిపోయాడు రంగనాధం.

నెలరోజుల తర్వాత -

"రేయ్... రాజయ్యా నాల్రోజుల్నుంచి వడ్డీ డబ్బు కట్టలేదు. వెళ్ళి గంటలోపల వాడి రిక్షా మనింట వాకిట్లో పెట్టండ్రా!" అని వస్తాదుల్లాంటి తన అనుచరులిద్దరినీ ఆజ్ఞాపించాడు - రంగ నాధం. ●



**ఉత్తమ ఉపాధ్యాయిని**
**ఓగిరాల లలితాదేవి**

ఆంధ్రయువతీ సంస్కృతీ కళాశాల (రాజమండ్రి) సెకండరీ పాఠశాలలో గ్రేడు 1 సంస్కృతపండితురాలుగా పని చేస్తున్న శ్రీమతి ఓగిరాల లలితాదేవి 1992 సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే ఉత్తమ ఉపాధ్యాయునిగా పురస్కారం అందుకున్నారు.

రేపల్లెలో జన్మించి కొవ్వూరు ఆంధ్ర గీర్వాణ విద్యాపీఠంలో 'సాహిత్య విద్యా ప్రవీణ' విద్యని అభ్యసించారు. కేశరాజు వెంకట నృసింహ అప్పారావుగారు, జటావల్లభుల పురుషోత్తం, ధూళిపాల రామచంద్రశాస్త్రి గార్ల నేతృత్వంలో 'సాహిత్య విద్యా ప్రవీణ' అయ్యారు. ఆ తర్వాత రాజమండ్రి ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాలలో సెకండరీ పాఠశాలలో గ్రేడు 2 సంస్కృత పండితురాలిగా ఉద్యోగంలో ప్రవేశించారు.

1965లో తిరుపతిలోని కేంద్రీయ విద్యాపీఠంలో 'శిక్షా శాస్త్ర' శిక్షణ పూర్తి చేసిన లలితాదేవి గ్రేడు 1 పండితురాలిగా ప్రమోట్ అయ్యారు.

సంస్కృత ఉపాధ్యాయురాలిగానే కాక సంగీతంలోనూ ఎంతో ప్రవేశం వున్న లలితాదేవి రాష్ట్రపతి రాధాకృష్ణన్ సమక్షంలో పిన్న వయసులోనే గాత్ర కచేరి చేసి ప్రశంసలు పొందారు. తన సోదరితో కలసి లలితాదేవి పలు కచేరీలు చేశారు. 'ఓగిరాల సిస్టర్స్'గా ఇద్దరూ ఎంతో పేరు సంపాదించారు.

లలితాదేవి గారి భర్త శ్రీ చామర్తి సత్యనారాయణ మూర్తి కొవ్వూరు మండల విద్యాశాఖాధికారిగా పని చేస్తున్నారు.

–వారణాశి జానకీ దేవి.